

# ఉభయకుశలోపరి

విమలాగౌతమ్

రైలు గట్టిగా కూత వేసింది.

అంటే బయల్దేరటానికి సిద్ధంగా వుందన్నమాట.

నా ముందుసీట్లో కూర్చున్న దుబ్బు మీసాలు ఎంతో సేపటినుంచి ఎడతెరిపి లేకుండా వున్న తన వాక్ప్రవాహానికి ఆనకట్టవేసి, ప్రక్కనున్న బట్టతలతో అన్నాడు, "కాఫీ త్రాగుదామా" అని

బట్టతల త్రాగుదాం అన్నట్లుగా అటూ, యిటూ ఊగింది –

"కాఫీ - కాఫీ – కాఫీ" అరుస్తూ వెడుతున్నాడు. ఒక పదిహేనేళ్ళ కుర్రాడు ప్లాట్‌ఫారంమీద.

దుబ్బుమీసాలు ఆ అబ్బాయిని కేకేసి, రెండు కాఫీ తీసుకున్నాడు.

కాఫీ అబ్బాయి చేతిలోని మిగతా ఖాళీ గ్లాసుల్తో అక్కడే నిల్చున్నాడు.

ఆ కాఫీ అబ్బాయిని చూస్తే ఏమిటో జాలివేసింది – చింపిరి జుట్టుతో, మాసిన బట్టలతో, పేదరికానికి ప్రతినిధిలా వున్నాడు – అలా వుండక యింకెలా వుంటాడు – రోజల్లా యిలా రెక్కలు, ముక్కలు చేసుకుని స్టేషన్‌లో కాఫీలు అమ్మితే – అతని కమిషన్ రెండుమూడు రూపాయలు అయినా వస్తుందో రాదో మరి.

వెంకయ్యగారు ఈసారి ఎన్నికలలో

నుంచుంటారని వినగానే, నేను ఆశ్చర్య పోయాను సుమా!" కాఫీ కొంచెం చప్పరించి అన్నాడు దుబ్బుమీసాలు.

"ఆయన కసలు నుంచోవాలని అనిపించలేదు. సుబ్బయ్యగారు నుంచుం టారని తెలిశాక, ఆయనకు పోటీగా వుండాలని ఈయన నుంచున్నాడు." బట్టతల కాఫీ త్రాగకుండానే నోరు చప్పరించాడు - ఈ రా జ కీ యా లు మనకి తెలియని వేమిటి అన్న సదుద్దేశంతో.

అభ్యర్థులు ఎలా ఎన్నికల్లో నుంచుం టున్నారో ఊహించుకుంటూ – వాళ్ళ మాటలు వింటున్నాను.

"అయితే నాగయ్య పార్టీవాళ్ళు ఈసారి ఎవర్ని సమర్థిస్తారుట ?" దుబ్బు మీసాలు అడిగాడు.

రైలు మళ్ళీ కూతవేసింది.

"సార్-గ్లాసూ డబ్బులు యివ్వండి సార్!" కాఫీకుర్రాడు అడుగుతున్నాడు.

"తాగనీవయ్యా - మరీను." కసురు కున్నాడు బట్టతల - కానీ నావేపే సూటిగా చూస్తున్నాడు.

పమిట సర్దుకుంటూ ఒకసారి బట్టతల వేపు చూశాను. చూపులు తిప్పి ఊదు కుంటూ నెమ్మదిగా కాఫీ త్రాగుతు న్నాడు.

కాఫీ అతను తొందరపడుతున్నాడు.

దబ్బుమీసాలు తన ప్రశ్నకు సమాధానం రాకపోవటంతో మళ్ళీ అడుగుతున్నాడు.

"అయితే నాగయ్య పార్టీవాళ్ళు ఈసారి ఎవర్ని సమర్థిస్తారుట !"

రైలు బయలుదేరింది. మెల్లగా వెడుతున్నది.

"గ్లాసులు సార్ - అరవై పైసలు సార్." అరుస్తూ రైలుతోపాటు చకచకా నడుస్తున్నాడు కాఫీ కుర్రాడు.

దుబ్బుమీసాలు అతన్నోమారు విసుగ్గా చూసి, మళ్ళీ కాఫీ త్రాగుతున్నాడు.

రైలు నడవటం మానేసి పరుగెత్తటం ప్రారంభించింది.

"అసలు నాగయ్య పార్టీవాళ్ళు అంతా విచిత్రమైన వ్యక్తులు-" బట్టతల అంటున్నాడు. తాపీగా జేబులోంచి చుట్టా, అగ్గిపెట్టె బయటకుతీస్తూ.

రైలుతో పాటే పరుగెడతున్న కాఫీ కుర్రాడు అరుస్తున్నాడు "సార్-గ్లాసులు డబ్బులు."

"విచిత్రమైన వ్యక్తులు అంటే నీ వుద్దేశంలో ఎలాటివారని ?" అడిగాడు దబ్బుమీసాలు కాఫీ త్రాగటం పూర్తి చేసి, గ్లాసు కిటికీదగ్గర పెడుతూ.

కుర్రాడు గ్లాసు అందుకున్నాడు.

"సార్ రెండు కాఫీ అరవైపైసలు సార్ - డబ్బులు సార్" పరుగెత్తు తున్నాడేమో రొప్పుతూ అడిగాడు.

"నేను ఒట్టినే అలా అనటంలేదు.

దానికి కారణముంది - నాగయ్యకు కులాభిమానం, ధనాభిమానం - రెండూ ఎక్కువే. పోయినసారి ఎన్నికల్లో ఈ నాగయ్య ఏంచేశాడంటే..."

రైలు ఇంకా వేగం అందుకుంది.

కుర్రాడు పరుగెత్తుతూ అరుస్తున్నాడు.

బట్టతల గ్లాసు అందించాడు.

"అరవైపైసలు." కుర్రాడు అరుస్తున్నాడు.

"చిల్లరుందా పది రూపాయలకి?" అడిగాడు దుబ్బుమీసాలు - పదిరూపాయలనోటు బయటకు తీయకుండానే -

"లేదు సార్." ఎప్పుడో అదృష్టం బాగున్న రోజున మాత్రమే చూస్తాడు వాడు పదిరూపాయల నోటు.

"మరయితే ఎలా?" బట్టతల అన్నాడు చుట్ట వెలిగిస్తూ.

ట్రెయిన్ ప్లాట్‌ఫారం దాటుతున్నది.

కుర్రాడు రైలుతో పరుగెత్తలేక వెనకబడ్డాడు. అయినా శక్తికొద్దీ పరుగెడుతున్నాడు. ఆ హడావిడిలో అతను అక్కడున్న స్తంభానికి గుద్దుకుని కిందపడ్డాడు

గాబరాగా చూశాను. అతను నెమ్మదిగా లేచి, దులుపుకుని వేగంగా పరుగెడుతున్న ట్రెయిన్‌వేపు దీనంగా చూస్తున్నాడు. చేతిలో గ్లాసులు కిందపడి పగిలిపోయాయి. అంటే ఈరోజు అతని ఆదాయంలో రెండురూపాయలు మినహాయించబడతాయన్నమాట

"పోయినసారి ఎన్నికల్లో నాగయ్య ఏంచేశాడు?" అడుగుతున్నాడు దుబ్బుమీసాలు, తనూ చుట్ట వెలిగిస్తూ.

బట్టతల అటూ, యిటూ అందరివేపు ఒకసారి చూసి అన్నాడు - "నాగయ్య పార్టీ - డబ్బున్నవాళ్ళనే సపోర్టు చేస్తారెప్పుడూ - పేదప్రజల కష్టాల గురించి ఆలోచించరసలు."

"అయితే ఈసారి వాళ్ళేం గెలుస్తారు? మనం వెంకయ్యగారి పార్టీనే సపోర్టు చేద్దాం. పేదప్రజల సేవ చేసుకునేనా బతుకవచ్చును." సలహా ఇచ్చాడు దుబ్బుమీసాలు.

"అంతే - అంతే - పదవులు వస్తే వస్తాయి, లేకపోతే లేదు. పేద ప్రజల సేవ చేసేవాళ్ళనే మనం సమర్థించాలి." బట్టతల సమర్థిస్తూ అటూ, యిటూ వూగింది.

